రుణమాఫీ కానీ రైతులు ఫిర్యాదుల కేంద్రాన్ని సంప్రదించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్
రుణమాఫీ కానీ రైతులు మండలాల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రాన్ని సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రెండు లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ వర్తించినట్టు పేర్కొన్నారు. వివిధ కారణాల వలన రుణ మాఫీ కాకపోతే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. సాంకేతిక కారణాల వలతో తప్పులు దొరినట్లయితే సరి చూసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు.

మాలకట్ట మైసమ్మకు బోనాలు



నవతెలంగాణ-కొందుర్గు
కొందుర్గు మండల కేంద్రంలోని మాలకుంట కట్టమైసమ్మ బోనాలు గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరినీ చల్లగా దీవించామని అమ్మవారిని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో గొంగల్ల శివజ్యోతి రాజేష్, రాజేష్ పటేల్, వార్త కృష్ణయ్య, గ్రామస్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి



- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జి. లింగ్యానాయక్

నవతెలంగాణ- వికారాబాద్ కలెక్టరేట్
అపరిష్కృతంగా ఉన్న సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి అదనపు కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార దిశగా పని చేయాలని అధికారులకు సూచించారు. అర్జీదారుల నుంచి స్వీకరించిన రెవెన్యూ సమస్యలపై నేరుగా తహసీల్దార్లతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీపై వచ్చిన దరఖాస్తులను వ్యవసాయ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ముందుగా రక్షాబంధన్ సందర్భంగా అధికారులకు అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యువత చెడు మార్గాల వైపు వెళ్లొద్దు



- డీవైఎఫ్ఐ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీకాంత్, యు.లింగం
- లోయపల్లిలో డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-మంచాల
యువత చెడు మార్గాల వైపు వెళ్లొద్దని మంచి మార్గాల వైపు ప్రయాణం చేయాలని డీవైఎఫ్ఐ లోయపల్లి గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పుల్యముల శ్రీకాంత్, ఊరూపక్క లింగం తెలిపారు. సోమవారం మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ దేశ వ్యాప్తంగా కార్యక్రమాలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ప్రస్తుత ప్రభుత్వాలు గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించాలని అనేక అవగాహనా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాలు కల్పించడంలో, నిరుద్యోగంను తగ్గించడంలో పూర్తిగా విఫలం చెందాయని తెలిపారు. కంపెనీల్లో కూడా లోకల్ వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా, ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగాలు ఇవ్వడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ గ్రామ ఉపాధ్యక్షులు ఈరమల్ల శేఖర్, కిరణ్, సహాయ కార్యదర్శులు ఎండి చాంద్ పాషా, లక్ష్మన్, సభ్యులు రాకేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపలో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-ఆమనగల్
ఈ నెల 21వ తేదీ నుంచి ఆమనగల్ పట్టణంలో నిర్వహిస్తున్న కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొనాలని కోరుతూ ఆలయ కమిటీ చైర్మెన్ మొక్తాల బాలమణి వెంకటయ్య సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొనాలని వెంకటయ్య ఆహ్వానించారు. ఆమనగల్ పట్టణంలోని సుర సముద్రం చెరువు కట్టపై కొలువై ఉన్న కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షులు ఎర్రవోలు యాదయ్య, సంఘం సభ్యులు మొక్తాల చిన్న వెంకటయ్య ఎర్రవోలు రాజు, ఎర్రవోలు మహేష్, మద్దూరి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నవతెలంగాణ-తలకొండపల్లి
మండల పరిధిలోని పాతకోట తండా గ్రామానికి చెందిన పాత్లావత్ జుమానిసోమవారంమృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షులు డోకూర్ ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.3వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలోని రాజేష్, రామచందర్, సాగర్, సురేష్, గణేష్, గోపాల్, మల్లేష్, డెసియా, లక్ష్మణ్, నరేష్, శ్రీను, శంకర్, రమేష్, గోపి, భాస్కర్, మేగ్య పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో డెంగ్యూ టెర్రర్



- మున్సిపాలిటీలో కొరవడిన పారిశుధ్యం
- నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్లు
- డెంగ్యూతో వ్యక్తి మృతి, మరొకరికి ఆస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స
- ఫోటోలతో సరి పెట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం
- భయంతో వణికిపోతున్న కొత్తూరు మున్సిపాలిటీ ప్రజలు
- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్ర విమర్శలు

వ్యక్తి మృతి



శ్రీకాంత్‌గౌడ్(ఫైల్)

ఇటీవల ఆర్కే కాలనీకి చెందిన ఎడ్ల శ్రీకాంత్‌గౌడ్ డెంగ్యూ సోకిన కేవలం మూడు, నాలుగు రోజుల వ్యవధిలోనే చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు. దీంతో అతని కుటుంబం రోడ్డున పడింది. అదే కాలనీకి చెందిన మరొకరు డెంగ్యూతో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. డెంగ్యూతో బాధపడుతూ చికిత్స పొందుతున్న తెలియని కేసులు మరెన్నో ఉన్నాయి. డెంగ్యూ కేసులను నిర్ధారించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కూడా కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.



కొత్తూరు మున్సిపల్ భవనం

కొత్తూరు మున్సిపాలిటీలో డెంగ్యూ కేసులు నమోదై ప్రాణాలు కోల్పోతున్నా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం ఫోటోలతో సరిపెట్టారని సర్వత్రా విమర్శలు విని పిస్తున్నాయి. మున్సిపాలిటీలో రెండు పాగింగ్ మిషన్‌లు ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించుకునే పరిస్థితి లేదు. వర్షాకాలం ప్రారంభం నుంచి సీజనల్ వ్యాధుల నివారణకు దోమల బెడద తగ్గించడానికి అనునిత్యం ఫాగ్ యం త్రాలతో కాలనీలలో పొగ మందు కొట్టించాలి. ఫాగ్ యంత్రాలను ఉపయోగించి మున్సిపాలిటీలో ఎక్కడ కూడా దోమల మందు కొట్టించలేదు. మున్సిపాలిటీ అధికారులు దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. సకల అంగులతో నిర్మించిన ఇంద్ర భవనం లాంటి కార్యాలయం వారికి విశ్రాంతి గదిలా మారిందని మున్సిపాలిటీకి చెందిన పలువురు బహాటంగానే విమర్శిస్తున్నారు. కార్యాలయానికి వచ్చామా.. పోయామా.. అన్నట్టుగా అధికారుల తీరు ఉందని వాపోతున్నారు.

నవతెలంగాణ-కొత్తూరు
కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లోని ఆర్కే కాలనీలో డెంగ్యూ విజృంభిస్తోంది. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో కేవలం ఫోటోలకు మాత్రమే ఫోజులిచ్చి ఉన్నత అధికారులకు గొప్పగా నిర్వ హించుకున్నట్టు చెప్పుకున్నారు.

వృథాగా దోమల నివారణ యంత్రాలు

కొత్తూరు మున్సిపాలిటీలో దోమల నివారణకై గత సంవత్సరం రెండు పాగింగ్ మిషన్లను కొనుగోలు చేసింది. ఒక్కో యంత్రానికి మూడు లక్షల 50 వేలు వెచ్చించి కొనుగోలు చేసింది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినప్పటికీ కాలనీలలో ఒక్కసారైనా దోమల నివారణ మందు కొ ట్టించలేదు. రెండు మిషన్లు ఉన్న వాటికి మర మ్మతులు చేయకపోవడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. తిమ్మాపూర్‌లోని ఆర్కే కాలనీలో ఒక వ్యక్తి మృత్యువాత పడ్డప్పటికీ నేటికి దోమల నివారణ మందు కొట్టించలేకపోయారు. మున్సిపల్ అధికారులు మేల్కొని మున్సిపాలిటీలోని పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

అట్టడుగు ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు అందలేదు

- మతోన్మాదుల చెర నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి
- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్
78 ఏండ్ల తరువాత కూడా ఆ స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగు ప్రజలకు అందలేదని కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు పాలకవర్గాలు ఎర్రతివాచి పరిచి అట్టడుగు ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని, స్వాతంత్ర ఫలాల సంరక్షణ కోసం దేశంలో ధర్మ యుద్ధం చేయటానికి యువతరం నడుం బిగించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో '78 ఏండ్ల స్వాతంత్రం-రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ జిల్లా సదస్సు కేవీపీఎస్ జిల్లా నాయకులు ఉప్పలి మల్లయ్య అధ్యక్షత జరిగింది. ఈ సదస్సుకు జాన్‌వెస్లీ హాజరై మాట్లాడారు.. భారతదేశం ప్రపంచ ఆకలి సూచికలో 111వ స్థానానికి చేరిందన్నారు. 40 కోట్ల నిరుద్యోగ సైన్యం పెరిగిందని, 46కోట్ల మంది ప్రజలు దారిద్ర రేఖకు దిగువన నివసిస్తున్నారని చెప్పారు. మరోవైపు 169 మంది శతకోటీశ్వరులు ఎదిగి ఆదానీ ప్రపంచంలో నెంబర్ 2 కుబేరుడుగా అయ్యాడని చెప్పారు. 40 శాతం మంది ప్రజల ఆస్తి ఒక శాతం చేతుల్లో మగ్గుతుందని ఈ ఆర్థిక అంతరాలు పెరుగుతున్న తీరు దేశాన్ని మరింత దిగజార్చే వైపు నడిపిస్తుందన్నారు. సామాజికంగా కుల వివక్ష, అంటరానితనం నేటికీ కొనసాగుతుందన్నారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెట్రేగిపోతున్నాయని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు మహిళలు మైనారిటీలపై 300 రెట్లు పెరిగాయన్నారు. దళితుల హత్యల్లో బీజేపీ పాలిత యూపీ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మహిళలపై గ్యాంగ్ రేప్‌లో మధ్యప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సామాజిక ఆర్థిక అంతరాలను తొలగించకపోతే దేశంలో మరో స్వాతంత్ర్య పోరాటానికి యువతరం నడుం బిగించాలన్నారు. మతోన్మాదుల చెర నుంచి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం ఫెడరలిజం, లౌకికత త్వం సామాజిక న్యాయాలను బీజేపీ వాటి పునాదుల నుంచి పెకిలిస్తుందన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను పరిశీలించినప్పుడు మెజారిటీ మతోన్మాద అధిపత్యం ఎక్కడ ఉంటే అక్కడ మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై మెజారిటీ మతోన్మాదులుగా ఉన్న ముస్లింలు దాడులు చేస్తున్నారని, ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. కానీ భారతదేశంలోనే మణిపూర్‌లో ఇద్దరు గిరిజన యువతులను నగ్నంగా ఊరేగింపు చేసినప్పుడు ఈ రోజు గొంతు చించుకుంటున్న మతోన్మాదులు ఆనాడు ఎందుకు నోరు విప్పలేదని విమర్శించారు. మతోన్మాదం ఏ దేశంలో ఉన్న ప్రమాదమేనని దాన్ని భారత రాజ్యాంగం అంగీకరించదన్నారు. మతసామరస్యం లౌకిక విలువల పరిరక్షణ కోసం భారతదేశ సమైక్యత సమగ్రతల కోసం యువతరం మతోన్మాదుల దుష్ప్రభావాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.మహిపాల్, నాయకులు సుదర్శన్, జె.లాలు, నవీన్ డి.నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్
దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి పాల్వాన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, మెదడు వాపు వ్యాధి, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రయివేట్ ఆస్పత్రుల వారు డెంగ్యూ వ్యాధికి చికిత్స చేస్తూ రోగుల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్టు అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఏ ఒక్కరూ కూడా డెంగ్యూ నిర్ధారణ కాకుండా డెంగ్యూ చికిత్స చేయొద్దని సూచించారు. ప్రయివేట్ ఆస్పత్రులలో డెంగ్యూ నిర్ధారణ అనంతరం చికిత్స అందించినట్లయితే ఆ పేషంట్ వివరాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎవరికైనా ఇబ్బందులు ఉంటే 77804 78817 వాట్సాప్ నెంబర్‌కు మేసేజ్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-తలకొండపల్లి
ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఖనాపూర్ గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం ఖానాపూర్ గ్రామానికి వచ్చారు. పలుగు కంపెనీలో పని చేస్తున్న జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రైక్వార్ రాజబాబు (33) మద్యానికి బానిస అయ్యాడు. ఆదివారం మద్యం తాగి వచ్చి అన్నదమ్ములతో గొడవ పడ్డాడు. అనంతరం తాగిన మైకంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్, బైకు ఢీ



- వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-చౌడాపూర్
చౌడాపూర్ మండలం మక్త వెంకటాపూర్ గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం వ్యాన్‌ను, బైకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మక్త వెంకటాపూర్ గ్రామానికి



చెందిన యువకులు మండల కేంద్రం నుంచి గ్రామానికి వెళ్తున్నారు. ఈ తరుణంలో చౌడాపూర్ వైపు వస్తున్న ఈకో వ్యాన్‌ని ఢీకొ ట్టారు. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన వ్యక్తిని స్థానికులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుడు మద్యం తాగి అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని అక్కడ చూసిన స్థానికులు తెలిపారు.

అన్నచెల్లెల అనుబంధం రక్షాబంధన్



వట్టినాగులపల్లి మాజీ ఎంపీటీసీ గొల్ల నాగేష్ యాదవ్‌కు రాఖీ కడుతున్న మాజీ చైర్‌పర్సన్ దార్గుపల్లి రేఖయాదగిరి.



నార్సింగిలో రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఉపసర్పంచ్ వత్తి శోభరాజ్, వారి కుటుంబ సభ్యులు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



అన్నకు రాఖీ కదుతున్న చెల్లి.



మహేష్, శైలేష్‌కుమారులతోపాటు వారి కుటుంబ సభ్యులకు రాఖీ కడుతున్న 17వ వార్డు కౌన్సిలర్ కే.ఉషారాణి.

నవతెలంగాణ-గండిపేట్
అన్నాచెల్లెళ్ల అనుబంధం అక్క తమ్ముళ్ల రుణబంధం రక్షాబంధన్ అని మహిళలు వెలుగెత్తి చాటారు. సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను పరిష్కరించుకుని అక్క చెల్లెలు అన్న తమ్ముళ్లకు రాఖీ కట్టారు. గండిపేట్ మండలం నార్సింగి, బండ్లగూడ, మణికొండ మున్సిపాలిటీలలో మహిళలు వారి అన్నలకు తమ్ముళ్లకు రాఖీలు కడుతూ శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగ్ మున్సిపాలిటీలోని మాజీ చైర్‌పర్సన్ దార్గుపల్లి రేఖయాదగిరి మాజీ ఎంపీటీసీ గొల్ల నాగేష్‌యాదవ్‌కు రాఖీ కట్టారు. సీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగి 17వ వార్డు కౌన్సిలర్ కే.ఉషారాణి తన ఇద్దరు తమ్ముళ్లు మహేష్, శైలేష్‌లకు రాఖీ కడుతూ తోడుగా ఉండాలంటూ హారతి పట్టారు. 9వ వార్డు కౌన్సిలర్ కే. లక్ష్మీ ప్రవళిక ఆమె అన్నదమ్ములకు రాఖీ కట్టి ఆశీర్వదించారు. నార్సింగ్ మున్సిపాలిటీలో మహిళలు వారి అన్నదమ్ములకు రాఖీలు కడుతూ తోడుగా ఉండాలంటూ వేడుకున్నారు. నార్సింగ్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీని వాస్ వారి అన్నదమ్ములకు రాఖీ కడుతూ శుభాకాంక్షలు తెలి పారు. అక్క చెల్లెళ్లకు అన్నదమ్ములు తోడుగా ఉంటూ రక్షణ కవచం లాగా అండగా ఉండాలని కోరారు. నార్సింగి, మంచిరేవుల, కోకాపేట్, గండిపేట్, వట్టినాగులపల్లి ఖానాపూర్, గౌలిదొడ్డి, మణికొండ, పుపాల్‌గూడ, బండ్లగూడ, హైదర్‌షాకోట్, పీరంచెరువు, కిస్మత్పూర్, హిమాయత్‌సాగర్, దర్గా ఖలి జఖాన్ గ్రామాల్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మహిళ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



శాసనమండలి మాజీ చైర్మెన్‌కు రాఖీ కడుతున్న కిస్మత్‌పూర్ మాజీ సర్పంచ్ జయశ్రీ సదానంద్



ప్రేమ బంధాలను పంచుతూ వారి తమ్ముళ్లకు రాఖీ కడుతూ హారతి పడుతున్న అక్క చెల్లెలు.



సోదరుడికి రాఖీ కడుతున్న కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళికకిరణ్.



బంధాన్ని పెంచుకునేందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న క్రైస్తవ సోదరీమణులు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వికారాబాద్
మంగళవారం | ఆగస్టు 20 2024 | www.navatelangana.com

వర్షాలు బాగా రావాలని ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బొంరాస్‌పేట్



వర్షం బాగా కురవాలని పంటలు బాగా పండాలని బోడబండ తండా గుట్టపైన వీరభద్ర స్వామి పరమేశ్వరుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలో నాయకులు రాజునాయక్ గ్రామ వాసులు పెద్దలు పిత్యా నాయక్. హన్మియా నాయక్ శంకర్ నాయక్ గణేష్ వినోద్ పవన్ తదితరులు పాల్గొన్నారు

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్

నవతెలంగాణ-దోమ



మండల మాజీ వైస్ ఎంపీపీ గుర్మిట్కల మల్లేశంకి సోదరి విద్యారాణి రాఖీ కట్టి అన్నయ్యను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అన్న చెల్లెళ్ళ అక్క తమ్ముళ్ల మధ్య ఉండే ప్రేమను బంధానికి ప్రతీక రక్ష బంధన్ అని, మానవీయ సంబంధాలను పటిష్టం చేస్తూ సాంస్కృతి సంప్రదాయలను ప్రతీకగా నిలిచి రాఖీ పండగను ప్రతి సోదరీమణులు అందరూ సుఖసంతోషాలతో జరుపుకొంటారని మండల మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం తెలిపారు.



మార్కాండేయ ఆలయంలో రాఖీ పండుగ వేడుకలు

నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్ పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాఖీ పండుగ సందర్భంగా 38వ నూలు పూర్ణిమ యజ్ఞం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొని పద్మశాలి బాంధవులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటర్, పదవతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించి అభినందించారు. అనంతరం ఆలయం ఆవరణలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మెన్ భీమనపల్లి దుర్గయ్య, నాయకులు అప్పం శ్రీను, అవ్వారి శివలింగం, గాజుల సత్య రాములు, గాజుల శ్రీనివాస్, అప్పం శ్రీనివాస్, పున్న శ్రీను, దోర్నాల ఈశ్వరయ్య, మామిడిశెట్టి రవి, చెరుకు రవి, పాలాది శ్రీను, గుర్రం సురేష్, ఎంగలి శ్రీధర్, అవ్వారి నిరంజన్, ఏలే నిరంజన్, గుజ్జరి ప్రవీణ్, శివలింగం, సోమశంకర్, గంజి శ్రీను, ఎంగలి రఘు, యాదగిరి, బోడ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల వ్యవసాయ అధికారిగా శంకర్‌లాల్

నవతెలంగాణ-చేవెళ్ల



రాష్ట్రంలో జరిగిన ఉద్యోగుల బదిలీల్లో భాగంగా చేవెళ్ల మండల వ్యవసాయ అధికారిగా శంకర్‌లాల్ బదిలీపై వచ్చారు. చేవెళ్ల మండల నూతన వ్యవసాయ శాఖ అధికారిగా శంకర్‌లాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శంకర్‌లాల్ జోగులాంబ గద్వాల జిల్లా అయిజా మండల వ్యవసాయ మండల అధికారి(ఏఓ)గా విధులు నిర్వహించారు. ఇదివరకు చేవెళ్లలో విధులు నిర్వహించిన వ్యవసాయ అధికారి (ఏవో) తులసి పరిగి పరిశోధనశాలకు (ఎస్‌టీఎల్)కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల మండల పరిధిలోని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి, రైతులకు సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయనను ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు సిబ్బంది పలువురు పూలమాలతో ఘనంగా సత్కరించారు.



భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

నవతెలంగాణ-కుల్కచర్ల

కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చుట్టూ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-ఆమనగల్

కడ్తాల్ మండలంలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన నేనావత్ పాండు నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ సభ్యులు జర్పుల దశరథ్ నాయక్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. తన వంతు తక్షణ సహాయంగా వారికి జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యులు ప్రియా రమేష్ నాయక్ మృతుని కుటుంబానికి రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి పంతు నాయక్, నాయకులు బాబా, ప్రకాష్, రాజు, అంజయ్య, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముద్విన్ గ్రామంలో..

ముద్విన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సొల్లు నారయ్య కుటుంబాన్ని తాజా మాజీ ఉపసర్పంచ్ వినోద్ కుమార్ పరామర్శించి తనవంతు సహాయంగా వారికి రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు కృష్ణయ్య, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, మహేష్, లక్ష్మయ్య, ప్రవీణ్, శ్రీశైలం, లోకేష్, సురేష్, మహేష్, బిక్షపతి, రవి తదితరులు పాల్గొన్నారు.





ఊరురా ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

నవతెలంగాణ-యాచారం

యాచారం మండల పరిధిలోని రాఖీ పండుగ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. రక్షాబంధన్‌ను పురస్కరించుకొని ఎవరింట్లో చూసిన అక్క చెల్లెళ్ల, అన్నాదమ్ముల ఆదరాభిమానాలు, ఆప్యాయతలు పంచుతూ రక్త బంధాన్ని గుర్తుండేలా ప్రజలంతా ఈ వేడుకను జరుపుకున్నారు. వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తు చేసుకునే విధంగా రాఖీ పండుగను నిర్వహించుకున్నారు. అక్క చెల్లెలు కలిసి తన తోడబుట్టిన అన్నదమ్ములకు రాఖీలు కట్టి తనకున్న అనుబంధాన్ని చాటుకున్నారు. యాచారం సెంటర్లో మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య భాష ఇంట్లో రాఖీ పండుగ సందడిగా సాగింది. మాల్ కేంద్రంలో మాజీ జడ్పీటీసీ చిన్నోళ్ళ జంగమ్మ యాదయ్య ఇంట్లో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల వ్యాప్తంగా రాఖీ పండుగ వేడుకలు సందడిగా, ఆనందభరితంగా కొనసాగాయి.

శంకర్‌పల్లిలో సీనియర్ జర్నలిస్ట్ నరసింహస్వామి మృతి

నవతెలంగాణ-శంకర్‌పల్లి



శంకర్ పల్లి మండలం మున్సిపాలిటీకి చెందిన సీనియర్ జర్నలిస్టు ఎం.నరసింహస్వామి (68) సోమవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రిలో మృతి చెందారు. నరసింహ స్వామి ఈనాడు దినపత్రికలో సుమారు 15 సంవత్సరాలుగా జర్నలిస్ట్ గా పనిచేశారు. ఆంధ్రప్రభ రిపోర్టర్‌గా, వార్త దినపత్రికలో సైతం ఆయన పనిచేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, శంకర్‌పల్లి మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ప్రజలకు సేవలు అందించారు. కాగా సోదరుడు శంకర్‌పల్లి సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్ నరేష్ కుమార్ నరసింహస్వామి అంత్రక్రియలు శంకర్‌పల్లిలో మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతాయని తెలిపారు. నిజాయితీకి, విజ్ఞతకు మరో పేరుగా పత్రికలలో పనిచేశారని ఆయన సన్నిహితులు, స్నేహితులు, బంధువులు తెలిపారు. రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, సన్నిహి తులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

శ్రీనివాస్ గౌడ్ ఇంట రాఖీ పండుగ సంబురాలు

నవతెలంగాణ-ఆమనగల్

టీపీసీసీ కార్యవర్గ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని తన నివాసంలో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అక్కా చెల్లెళ్ళు కరుణశ్రీ, ఉమాదేవి, రేణుకా దేవి, కల్పనా దేవి తదితరులు శీనన్నకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ తల్లి లక్ష్మమ్మ, పద్మశ్రీ, తేజస్విని, శిరీష, పూజ, ప్రవీణ్, ధనీంద్ర, చంద్రతేజ, అను, అభి, ఫలనీష్, సుగంధ్, నిధి, ధనశ్రీ, నిహాణ్య, విహాన్, గూగుల్ తదితరులు పాల్గొన్నారు.





న్యాయవాది సంతోష్‌ని వేధించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- కోడంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన

నవతెలంగాణ-కోడంగల్

కూకట్‌పల్లి బార్ అసోసియేషన్‌లో అడ్వకేట్‌గా పనిచేస్తున్న సంతోష్‌పై చేయి చేసుకున్న బోరబండ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కొడంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటయ్య డిమాండ్ చేశారు. న్యాయవాదులపై నిత్యం పోలీసుల దౌర్జన్యాలకు నిరసనగా తెలంగాణ అడ్వకేట్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా కోడంగల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడ్వకేట్ సంతోష్ కుమార్‌ను వేధించిన బోరబండ ఎస్ఐ జమీల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయన్నారు. బోరబండలో మద్యం అమ్ముతున్న ఓ ఇంట్లో న్యాయవాది సంతోష్ రెంటుకు ఉంటున్నారని అన్యాయంగా ఆయనను కేసులో ఇరికించారన్నారు. పోలీసులు చట్టం తమ చేతుల్లో ఉందని న్యాయవాదులు ఏమి చేయలేరని దౌర్జన్యానికి ఒడిగడుతున్నారన్నారు. తక్షణమే బోరబండ ఎస్సై జమీల్, ఇతర పోలీస్ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాది సంతోష్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కర్ణాకర్ రెడ్డి. సుధాకర్ రెడ్డి. బస్వరాజ్, రాములు. రవీందర్ నాయక్. రమేష్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఆమనగల్



ఆమనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. పట్టణంలోని అపోలో మెడికల్ ఎదురుగా శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి డివైడర్ పై సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. అనారోగ్యం, ఇతర ఏ కారణాల వల్ల మృతి చెందాడో తెలియాల్సి ఉందని ఆయన చెప్పారు. బ్లూ షర్ట్ బ్లాక్ ఫైంట్ ధరించి ఉన్న సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తుపట్టినచో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ పేర్కొన్నారు.



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ-కుల్కచర్ల

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు నల్లమల్ల మొగులయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి , పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యదర్శి బుగ్గయ్య, దళిత యువశక్తి యువజన సంఘం అధ్యక్షులు కృష్ణయ్య, వెంకటయ్య, దస్తయ్య నరసింహారెడ్డి, బొక్క రవి, నరేష్, కేశవులు, దండు బాలయ్య, శ్రీశైలం, శ్రీనివాస్, మొగులయ్య, బచ్చయ్య, హనుమంతు, నర్సింలు, రమేష్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



అక్కతమ్ముళ్ల, అన్నా చెల్లెల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక

నవతెలంగాణ-దోమ

మండల కేంద్రంలో సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నంగా నిలిచే రాఖీ పండుగను అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఘనంగా చేసుకున్నారు. శ్రీ సాయి చరణ్, అభినవ్‌కు తొడ పుట్టిన చెల్లెలు ఆరాధ్య రాఖీ కట్టి పండుగ ఘనంగా చేసుకున్నారు. జీవితాంతం ఒకరికొకరు రక్షణగా ఉండాలనే నమ్మకంతో అన్నలకు చెల్లెళ్లు, తమ్ముళ్లకు అక్కలు చేతికి రాఖీ కడుతారు. అయితే కేవలం రక్త సంబంధీకులే కాకుండా ప్రకృతి నుంచి కూడా రక్షణ ఉండాలనే సదుద్దేశంతో అందరూ వినూత్నంగా రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. ప్రతీ ఇంట్లో సోదరి మణులు తమ సోదరులకు రాఖీలు కట్టి అప్యాయతను చాటారు. యువతులు, మహిళల సందడితో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది.



ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్ పట్టణంలో సోమవారం ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 185వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాడిగే సత్యం, ఉపాధ్యక్షులు శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి జావేద్, కోశాధికారి వెంకటేష్ యాదవ్, సభ్యులు ఎంఏ అలీం, జబ్బార్, యాదగిరి, నాజర్, శ్రీకాంత్, మహేష్, రాజు, నరసింహ, శేఖర్, గఫార్, కలీమ్, రఫీ, ప్రవీణ్ రెడ్డి, గణేష్, శ్రీశైలం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల ప్రేమ, అభిమానాలతో రాఖీ పండుగ సందర్భంగా ధారూర్ మండల మైలారం గ్రామానికి చెందిన అన్న మదులపల్లి శ్రీనాథ్‌కు ప్రేమతో రాఖీ కట్టిన చెల్లి శాన్వి . అలాగే ప్రతి ఆడబిడ్డ క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-ధారూర్



భారతీయ సాంప్రదాయానికి ప్రతీక రాఖీ పండుగ







నవతెలంగాణ-చేవెళ్ల

భారతీయ సంప్రదాయానికి ప్రతీక రాఖీ పండుగ అని సీనియర్ నాయకులు శేరి నర్సింగ్‌రావు, ముడిమ్యాల గ్రామ మాజీ సర్పంచ్ శేరి స్వర్ణలత దర్శన్ అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా రాఖీ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పండుగ అన్న చెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని ప్రతిబింబిస్తుందని, భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాఖీతో అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధం మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు. సోదరులంతా తమ అక్కాచెల్లెళ్లపై అనిర్వచనీయమైన ప్రేమను కురిపించడంతోపాటు వారి రక్షణ బాధ్యతలు ప్రతి సోదరుడు తీసుకోవాలని కోరారు. చేతికి రాఖీ కట్టడం గొప్ప సందర్భంగా అభివర్ణించారు. రక్షాబంధన్ సంప్రదాయం భారతీయ జీవన ఔన్నత్యానికి నిదర్శనమని తెలిపారు. ప్రజల్లో సహోదరత్వాన్ని రాఖీపండుగ మరింతగా పెంచుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా కాలనీలలో చిన్నపిల్లలు రక్షాబంధన్ నిర్వహించడం కనిపించింది. ఈ కార్యక్రమంలో శేరి బ్రదర్స్ శ్రీనివాస్, దర్శన్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేటలో శ్రమదానం



నవతెలంగాణ-మోమిన్‌పేట్

మండల కేంద్రంలో మార్కెట్ రోడ్డులో షాప్‌ల ముందు ఉన్న గడ్డిని తొలగించారు. వర్షాలకు గడ్డిలో దోమలు ఈగలు ఉండటం వలన అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలని తొలగించినట్టు గ్రామస్తులు తెలిపారు.



మోమిన్‌పేట మండలంలోని ఎనికేపల్లి గ్రామం నుంచి మొరంగపల్లి వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షాలకే బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుక ఎనికేపల్లి గ్రామానికి చెందిన గుట్టమీది యేసయ్య స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. గ్రామస్తులు యేసయ్యను అభినందించారు.

నవతెలంగాణ-మోమిన్‌పేట్

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ వర్తింపచేయాలి
- బీఆర్ఎస్ దోమ మండల అధ్యక్షులు గోపాల్‌గౌడ్

నవతెలంగాణ-దోమ



రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలనీ, అదేవిధంగా ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన రేవంత్ రెడ్డి 8 నెలలుగా ఊరించి ఊరించి చివరకు రైతులకు తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని ముంచి ఉసురుమనిపించారనీ బీఆర్ఎస్ పార్టీ దోమ మండల అధ్యక్షులు గోపాల్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్రంలో 47 లక్షల మందికి అర్హులైన రైతులు రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 22 లక్షల మందికి రుణమాఫీ చేయడం చాలా దురదృష్టకరమని, అదేవిధంగా ఇప్పటికే రైతు భరోసా సహాయం ఇవ్వకుండా ఇగ్గొట్టారనీ తెలిపారు. రైతు భరోసా ఖరీఫ్ సీజన్ డబ్బులు ఈనెల ఆఖరిలోగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాల్సిన నిధులు రుణమాఫీకి మలించిందన్నారు. రుణమాఫీ కానీ రైతులను మళ్లీ మోసం చేసేందుకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారన్నారు. రుణమాఫీ కానీ అన్నదాతలు ఆందోళనలతో యావత్ తెలంగాణ రాష్ట్రం అట్టుడుకుతుందన్నారు. వరంగల్‌లో రైతులకు డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని,అదేవిధంగా ఈనెల చివరి వరకు రైతు భరోసా ఖరీఫ్ సీజన్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఆత్మీయం..అనుబంధం

అన్నకు రాఖీ కట్టిన చెల్లెలు

ఘనంగా మండల వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-దోమ

భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిరూపంగా భావించే రక్షాబంధన్ వేడుకలను సోమవారం మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుచులు పుట్టింటికి చేరుకుని తమ సోదరులకు ప్రేమతో, కలకాలం సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ రాఖీలు కట్టి దీవించారు. దీనికి ప్రతిగా సోదరులు నూతన వస్త్రాలు, బహుమతులను కానుకగా అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులంతా సమీప ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు.



ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-కోడంగల్

కోడంగల్ నియోజకవర్గంలో ఆయా గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు వారి సోదరులకు రాఖీలు కట్టి తమ అనురాగాన్ని చాటగా సోదరులు వారికి కానుకలను ఇచ్చారు. వివిధ పట్టణాల్లో ఉంటున్న మహిళలు గ్రామాలకు పెద్దఎత్తున తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. సోదర సోదరీమణుల అనురాగానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగలో తమ అనురాగాలు, ఆప్యాయతలను చాటుకున్నారు. అన్నాదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించగా వారికి కానుకలను అందించారు. మెట్టినింటి నుండి పుట్టింటికి రాఖీలు కట్టేందుకు మహిళలు పెద్దఎత్తున రావడంతో ఆనందోత్సహాల నడుమ రాఖీ పండుగ జరిగింది.



ఎంపీ అభ్యర్థికి ఎమ్మెల్యేను పరిచయం చేయించిన సీఎం

నవతెలంగాణ-ఆమనగల్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని రాజ్యసభ ఎంపీ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీతో పరిచయం చేయించారు. సింఘ్వీ నామినేషన్ దాఖలు అనంతరం ఆదివారం సాయంత్రం జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని అభిషేక్ మను సింఘ్వీకి పరిచయం చేయించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

వెల్లువిరిసిన అన్నా చెల్లెల అనుబంధం



- ఇంటా బయట ఊరు వాడ రాఖీ పండుగ సందడి

నవతెలంగాణ-ఆమనగల్

అన్నా చెల్లెళ్ల, అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను పురస్కరించుకొని సోమవారం ఆమనగల్, కడ్తాల్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ఊరు వాడా అనే తేడా లేకుండా ఇంటా బయటా సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అక్కలు, చెల్లెళ్లుతమ అన్నదమ్ములకు రాఖీని కట్టి వారి మీద ఉన్న ప్రేమను చాటుకుంటారు. రాఖీ పండుగ అనేది ఒక రక్షాబంధనం లాంటిది. అక్కాచెల్లెళ్లను తాము కాపాడుతామని భరోసాను ఇస్తారు. అన్నదమ్ములు కేవలం ఒకే కుటుంబంలో పుట్టిన అన్నా చెల్లెలు కాదు, అన్నా, తమ్ముని వరుసయ్యేవారికి మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపిస్తారు. అదేవిధంగా రాఖీలు కట్టించుకున్న వారు తమ అక్క చెల్లెళ్లకు కానుకలు అందజేస్తారు. ఈ క్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన సోదరీమణి రామేశ్వరమ్మ రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. అదేవిధంగా రాష్ట్ర సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డికి ఆయన సోదరి చిగురింత పుష్పలత మల్లారెడ్డి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండు బాలరాజ్ మృతి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

నవతెలంగాణ షాబాద్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండు బాలరాజ్(78) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. షాబాద్‌లోని దండు బాల్ రాజ్ ఇంటికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చేరుకొని మృతునికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించిన బాలరాజ్ మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. మృదుస్వభావి, అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి అకస్మాత్తుగా చనిపోవడం చాలా బాధగా ఉందని అన్నారు. మృతుని కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంబడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు రాజేందర్ గౌడ్, మహేందర్‌గౌడ్, దండు రాహుల్ గుప్తా, రవీందర్ నాయక్, కమ్మరి శ్రీను, తదితరులు ఉన్నారు.



భారత్ బంద్‌ను విజయవంతం చేయండి



- మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహేష్ మాల

నవతెలంగాణ-షాద్‌నగర్

రేపు జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహేష్ మాల అన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహేష్ మాల పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపైన ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగం విరుద్ధమని తెలిపారు. ఈ తీర్పు రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు, రిజర్వేషన్లను క్రమంగా తొలగించేందుకు పన్నిన కుట్ర రాజ్యాంగాన్ని బలహీన పరిచి రిజర్వేషన్లను తొలగించి ఎస్సీ, ఎస్టీలకు ఆర్థికంగా సామాజికంగా అణిచివేసే కుట్రలను అంబేద్కర్ వాదులందరూ ఐక్యతతో తిప్పి కొడదామని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా మనకు కల్పించిన హక్కులను కాపాడుకుందామని, సుప్రీంకోర్టు తీర్పును దేశ వ్యాప్తంగా ఉన్న దళిత గిరిజన సంఘాలు రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా భీమ్ సేన, ట్రైబల్ ఆర్మీ, ప్రజా సంఘాలు దేశ వ్యాప్తంగా భారత్ బంద్‌కు పిలుపునిచ్చారని అన్నారు. జేఏసీ భారత్ బంద్‌కు మాలమహానాడు మద్దతు ఇస్తూ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్న మాల సమాజం భారత్ బంద్ లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వినోద్, శేఖర్, కేశవులు, మూర్తి, ప్రవీణ్ పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలి





- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ

నవతెలంగాణ-ఆమనగల్

దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ అన్నారు. మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ మడేలేశ్వర స్వామి, ఈదమ్మ దేవి ఆలయాల్లో సోమవారం విగ్రహ ప్రతిష్ట వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో యాట నర్సింహ ముదిరాజ్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, నిట్ట నారాయణ తదితరులు పాల్గొని స్థానిక నాయకులతో కలిసి విగ్రహ ప్రతిష్ట అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు వారిని ఆలయ మర్యాదలతో పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. దైవ చింతనను అలవర్చుకొని సన్మార్గంతో ముందుకు సాగే వారు సుఖ శాంతులతో ఆనందమయమైన జీవితాన్ని గడుపుతారని వారు పేర్కొన్నారు. ఈనెల 17న ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు మంగళవారం వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీపాతి రజిత శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నిట్ట మంగమ్మ నారాయణ, మాజీ ఉపసర్పంచ్ శేఖర్ గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షులు తెల్గమల్ల జగన్, కడ్తాల్ మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బాలరాజు, రజక సంఘం అధ్యక్షులు మాచర్ల రామచంద్రయ్య, ఆలయ చైర్మెన్ కానుగుల మల్లేష్, నాయకులు వేణు, యాదయ్య, వెంకటయ్య, రాములు, శ్రీను, శేఖర్, చెన్నయ్య యాదవ్, రవి, కిష్టయ్య, చిన్న కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



దుండగులను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య

నవతెలంగాణ-షాబాద్

కోల్‌కత్తా నగరంలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. దుండగులను వెంటనే శిక్షించాలంటూ షాబాద్ మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేస్తున్న మహిళ డాక్టర్లపై ఇలాంటి దాడులు జరగడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, నాయకులు రుక్కయ్య, శ్రీశైలం, రాములు, పాండు, ఉదయ్ కిరణ్, రఘురాం, మధు, నారాయణ, నాగమణి, బాలమణి, తదితరులు, పాల్గొన్నారు.



తాగునీళ్లు వస్తేలే..

వారం రోజులుగా ఇబ్బందులు గురవుతున్నాం

తిమ్మాయిపల్లి గ్రామస్తుల ఆవేదన

నవతెలంగాణ-దోమ

మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో వారం రోజులుగా తాగునీరు రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సరఫరా చేసే సింగల్ పేస్ మోటర్ కాలిపోవడం జరిగిందనీ, పంచాయతీ కార్యదర్శి చెప్పిన జీపీలో పైసలు లేవనీ నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలోనీ పంచాయతీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహిరిస్తూ గ్రామ సమస్యలపై పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండల అధికారులు స్పందించి గ్రామంలోని సింగల్ పేస్ మోటార్‌ను బాగు చేయించి తాగునీరు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు శ్రీనివాస్, రాములు, పాషా, శ్రీనివాస్, పులి కోరుతున్నారు.

నేడు మోమిన్‌పేట్ బంద్

నవతెలంగాణ-మోమిన్‌పేట్

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందువులకు మద్దతుగా హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మోమిన్‌పేట్ మండల కేంద్రంలో ఆగస్టు 20న ఉదయం 10 గంటలకు బసవేశ్వర చౌక్ నుంచి ర్యాలి నిర్వహించనున్నట్టు నిర్వహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని షాపుల యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించి ర్యాలీలో పాల్గొనాలని కోరారు.




ఘనంగా రాఖీ పండుగ

- అక్క చెల్లెళ్లతో సందడిగా

మారిన కుటుంబాలు


నవతెలంగాణ-మర్పల్లి



అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగాలు పంచుకుంటూ కష్టసుఖాల్లో తోడుంటామని చెప్పుకునే పండుగే రక్షాబంధన్. ప్రతి ఏడాది శ్రావణ మాసం పూర్ణిమ తిథి నాడు రక్షా బంధన్ పండుగ జరుపుకుంటారు. రాఖీలు కట్టేందుకు వచ్చిన ఆడపడుచులతో కుటుంబాల్లో సందడి నెలకొంది



ఆర్య వర్ధన్ గుప్తా తమ్మునికి రక్షాబంధన్ సందర్భంగా రాఖీ కట్టిన అక్క నిక్షిత
నవతెలంగాణ-ధారూర్



వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కుక్కిందాలో అన్నా చెల్లెలి అనుబంధం ఎప్పుడూ ఇలాగే ఉండాలని అన్నయ్య సాయి చరణ్‌కి రాఖీ కడుతున్న చెల్లమ్మ సాత్విక.
నవతెలంగాణ-ధారూర్





అన్నలకు రాఖీ కడుతున్న చెల్లెలు



తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
రంగారెడ్డి
మంగళవారం | ఆగస్టు 20 2024 | www.navatelangana.com

ఘనంగా రాఖీ పండుగ



నవతెలంగాణ-దోమ

మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో రాఖీ పౌర్ణమి పండగను అన్న చెల్లెలు,అక్క తమ్ముళ్ల రాఖీలను కట్టుకొని పండగను సుఖ సంతోషాలతో జరుపుకొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ



నవతెలంగాణ-శంషాబాద్

శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అక్కాచెల్లెలకు రాఖీ పండుగ శుభాకాంక్షలను తెలిపారు. అనుబంధాలకు అప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ అని ఆయన అన్నారు.

ఘనంగా హరీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు హరీ జన్మదిన వేడుకలు సోమవారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఇక ముందు ముందు మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ బిజెపి సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్, జాజేరావు శ్రీను, రాములు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రతి డివిజన్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించి అభివృద్దే ప్రధాన ఎజెండాగా పనులు చేపటేందుకు కృషి చేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి నూతనంగా నిర్మించిన సీసీరోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం నెలకొన్న బస్తి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్ ఎంసీ ఏఈ ప్రశాంత్ స్థానిక ప్రజలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఆదిత్య నగర్, మాదాపూర్ డివిజన్‌లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్క ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని వారు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం చూపుతామన్నారు. డివిజన్ పరిధిలో మంజూరైన అభి వృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేలా అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు కార్యక్రమంలో బస్తి నాయకులు మునఫ్ ఖాన్, రహీం, హనీఫ్, మహమ్మద్ ఖాజా, షోయబ్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

బైక్ అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-మోమిన్‌పేట

బైక్ అదుపు తప్పి కింద పడడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మోమిన్‌పేట మండలం కేసారం వద్ద గల జేబీఎస్ వెంచర్ దగ్గర సోమ వారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎన్కేపల్లి రమేష్ బైక్‌పై వెళ్తున్నాడు. రోడ్డుపై గుంతలు ఉండడంతో బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి వెంటనే 108కి కాల్ చేశారు. వారు సకాలంలో స్పందించక పోవడంతో ఆటోలో మోమిన్ పేటలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలిం చారు. రోడ్డు గుంతలమ యంగా ఉండడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.



మురుగు నీటిలో దీప్తిశ్రీ నగర్

- నడి రోడ్డుపై పొంగిపొర్లుతున్న మ్యాన్ హెూల్స్
- అంతంత మాత్రంగా ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితి
- నిరంతరాయంగా ప్రవహిస్తున్న మురికి నీరు, వర్షం నీరు
- గుంతలుగా మారిపోయిన రోడ్లు
- దోమలు, ఈగల వ్యాప్తితో పాటు మురికి కంపు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు





అసలే వర్షాకాలంలో వ్యాధులు విజృంభించే అవకాశాలు మొండుగా ఉంటాయి. ఇలాంటి సమయంలోనే అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు రోడ్లను, కాలనీలను పర్యవేక్షించాలి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ సర్కిల్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్‌లోని ప్రధాన రహదారి నుండి ఎంఏనగర్, స్టాలిన్‌నగర్ వైపు వెళ్లే రోడ్డులో ఎంఏనగర్ వద్ద, ప్రశాంత్‌నగర్‌లో నడి రోడ్డుపై మ్యాన్ హెూల్స్ పొంగిపొర్లుతున్నాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు, పాదాచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా రోడ్లు నడవలేని స్థితికి రాకముందే మురికినీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి మరమ్మతులు చేపట్టాలని అధికారులను వారు కోరుతున్నారు.

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

స్వచ్ఛ హైదరాబాద్ పేరుతో అధికారుల హడావిడి తప్పా కాలనీల్లో మురికి నీరు రోడ్ల పై ఏరులై పరుతున్నా పట్టించుకున్న నాథుడే లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ సర్కిల్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనిలో 4,5 రోడ్లపై డ్రయినేజీ నీరు మ్యాన్ హెూల్‌ల నుండి పైకి వచ్చి రోడ్లపై నుండి వరదల్లా ప్రవహిస్తూనే ఉంది. దాదాపు 15 రోజులు గా ఇలాగే ప్రవహిస్తున్నా ఏ ఒక్క అధికారి కానీ ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదు. అసలే వర్షా కాలం కావడంతో నీటి ప్రవాహం తగ్గడం లేదు. దోమలు, ఈగల వ్యాప్తితో పాటు మురికి కంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీప్తిశ్రీనగర్‌లోని ప్రధాన రహదారి నుండి ఎంఏనగర్, స్టాలిన్‌నగర్ వైపు వెళ్లే రోడ్డులో ఎంఏనగర్ వద్ద, ప్రశాంత్‌నగర్‌లో నడి రోడ్డుపై మ్యాన్ హెూల్స్ పొంగిపొర్లుతున్నాయి. కాలనీ పార్క్ వద్ద, పై భాగంలో వాటర్ ట్యాంక్ వద్ద ఇలా అనేక చోట్ల మ్యాన్ హెూల్స్ నుండి మురికి నీరు ఉబికి వచ్చి రోడ్లపై నుండి ప్రవహిస్తూనే ఉన్నాయి. దీంతో ఈ రోడ్లపై నుండి వెళ్లే వాహనదారులకు, పాదాచారులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మురికి నీటిలో నుండే వెళ్లాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు మురికి నీరు పాదాచారులపై పడి ఒళ్ళంతా కంపు కొడుతుందని వారు తెలిపారు.

అధికారులకు పట్టాదా ?

ఎన్నోరోజులుగా సమస్య ఉన్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని, వారికీ పట్టదా అని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. వాటర్ ట్యాంక్ వద్ద ఓ ఇంటి ముందు చిన్న ప్రాబ్లమ్‌తో డ్రయినేజీ పొంగి పొర్లుతున్న విషయాన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పక్కింటి వారు తెలిపారు. కనీసం ఆ ఇంటి వారు కూడా స్పందించకపోవడం వారి విజ్ఞత ఏ పాటిదో అర్థం అవుతుందని కొందరు వాపోయారు. కనీసం మా ఇంటి నుండి వెళ్లే మురికి నీరు వల్లే ఇతరులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకోక పోవడం వారి నిర్లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇటు అధికారులు స్పందించక పోవడం మరీ దారుణమని తెలిపారు.

రోడ్లు డ్యామేజ్

అసలే అంతర్గత రోడ్ల పరిస్థితి అంతంత మాత్రమే. ఇలా నిరంతరాయంగా మురికి నీరు, వర్షం నీరు ప్రవహిస్తుంటే రోడ్లు మొత్తం గుంతలుగా మారిపోయాయి. మరికొన్ని రోడ్లు పడవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. దీప్తిశ్రీనగర్ కాలనీలోని చౌరస్తా నుండి స్టాలిన్‌నగర్ వెళ్లే రహదారి మొత్తం గుంతలుగా మారిపోయి, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు, పాదాచారులు తెలిపారు. పూర్తిగా రోడ్లు నడ వలేని స్థితికి రాకముందే మురికినీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.





మియాపూర్‌లో ఘనంగా ఫోటోగ్రఫీ డే

నవతెలంగాణ-మియాపూర్

ప్రపంచ 185 ఫోటోగ్రఫీ డే సందర్భంగా మియాపూర్ డిజిటల్ ఫోటో స్టూడియో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఫోటో అనేది మనిషి హావభావాలను, మధుర స్మృతులని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ప్రెసిడెంట్ వాల్మీకి, వైస్ ప్రెసిడెంట్ రాజు, సెక్రెట్రీ విజయ్ పాలంగే, జాయింట్ సెక్రెట్రీ గణేష్ యాదవ్ ట్రెజరర్ అన్వర్ ఖాన్, మీడియా పాట్నర్ మహేష్ దావత్, ఏరియా ఇన్‌చార్జి హర్ష శ్రీను, పలువురు ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు



పాఠశాలల్లో కరాటే తప్పనిసరి



- కరాటే గ్రాండ్ మాస్టర్ కర్రోళ్ల నరసింహ
- ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో సత్తా చాటిన కొత్తూరు విద్యార్థులు

నవతెలంగాణ-కొత్తూరు

ఇంటర్నేషనల్ కరాటే పోటీలు కొత్తూరు బోధి వర్మ కుంపు కరాటే విద్యార్థులు ప్రతిభ చాటారు. 4వ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2024 యాదాద్రి భువనగిరి జిల్లా ఎంఎస్ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన కరాటే పోటీల్లో కొత్తూరు భోగి వర్మ కుంపు అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి పలువురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారు. విద్యార్థులు చాణిక్య, దివ్య, కావ్యా, దినేష్, సాయి పవన్, మిల్కీ, హరిశంకర్ వరప్రసాద్, హరినాథ్ విద్యార్థులు బహుమతులు కైవసం చేసుకున్నారు. గ్రాండ్ మాస్టర్ కర్రోళ్ల నరసింహ సర్టిఫికెట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ....చిన్నారులు బలంగా దృఢంగా ధైర్యంగా ఉండాలంటే కచ్చితంగా కరాటే నేర్చుకోవాలని అన్నారు.

ఘనంగా రక్షాబంధన్







నవతెలంగాణ-కందుకూరు

మండలం రక్షాబంధన్ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అక్క చెల్లెలు, అన్నదమ్ముల ఆత్మీయ ప్రత్యేకత నిలిచే రాఖీ పండుగ ప్రతి ఒక్కరు జరుపుకుంటాం. మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏనుగు జన్మ రెడ్డి లకు అక్కా చెల్లెలు రాఖీ కట్టి అన్నదమ్ముల ప్రేమను వ్యక్తం చేశారు. పిల్లలు పెద్దలు, అనే తేడా లేకుండా, రాఖీ పండుగ జరుపుకున్నారు.

రాజేంద్రనగర్‌లో ఘనంగా రక్షాబంధన్

నవతెలంగాణ-రాజేంద్రనగర్



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కి రాఖీ కడుతున్న ప్రజాపిత బ్రహ్మ కుమారి సోదరీమణులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ నియోజకవర్గ ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరి మణుల ప్రేమ దేవుడి ఆశీర్వాదం కంటే గొప్పదన్నారు.



రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌కి బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకురాలు ఉమా మహేశ్వరి రాఖీ కట్టారు.



గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ విప్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి మైలార్ దేవుపల్లి డివిజన్‌కు చెందిన మహిళ రాఖీ కట్టారు.

తాండూరులో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

- రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-తాండూరు

తాండూరులో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకల సందర్భంగా తాండూరు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కోత్రిక విజయలక్ష్మి మాజీ వైస్ చైర్మన్ సాజిద్ అలీకి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా వివిధ వార్డుల్లో ప్రజాప్రతినిధుల, ప్రజలు రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అనుబంధాలకు అప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ అని ఆయన అన్నారు. మన సాంప్రదాయాలను సంస్కృతీని మన పండుగల్లో ప్రతిబింబిస్తాయని పలువురు తెలిపారు.











రాఖీ పండుగ శుభాకాంక్షలు

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

తోడబుట్టిన అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల నడుమ అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ పండుగ సందర్భంగా ప్రజలందరికీ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రవీందర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..కుటుంబ బంధాలు, రక్తసంబంధాల్లోని ఔన్నత్యాన్ని, మానవ సంబంధాల్లోని పరమార్థాన్ని రాఖీ పండుగ తెలుపుతుందన్నారు. రాఖీని రక్షా బంధంగా భావించే ప్రత్యేక సంస్కతి మనదని తెలిపారు. అన్నాదమ్ముళ్లకు రాఖీలు కట్టడం ద్వారా తమకు రక్షణగా నిలువాలని అక్కాచెల్లెళ్లు ఆకాంక్షిస్తారని తెలిపారు. రాఖీ పండుగను ప్రజలంతా ప్రేమా నురాగాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా రాఖీ వేడుకలు

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక అయిన రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇంత ఆధునిక ప్రపంచంలోను ఇంకా తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుతూ మన తెలుగు పండుగలు ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు.



నోములలో సర్దార్ పాపన్నగౌడ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-మంచాల

మండల పరిధిలోని నోముల గ్రామ కౌండిన్య సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువరు సంఘం పెద్దలు మాట్లాడుతూ.. సామాన్య వ్యక్తి, శత్రు దుర్భేద్యమైన కోటలను వశపరచుకోవడంలో దిట్టఅని, పోరాటయోధుడని కొనియాడారు. కార్యక్రమంలో ఈరమల్ల నర్సింహగౌడ్, శివయ్యగౌడ్, దూసరి బాలయ్య గౌడ్, సదానందం గౌడ్, దండు బుచ్చయ్య గౌడ్, చెరుకు బుగ్గయ్య గౌడ్, దండు గోపాల్ గౌడ్, సత్తయ్య గౌడ్, దుబ్బాకుల స్వామి గౌడ్, పాశం వెంకటేష్ గౌడ్, ఈ రమల్ల జంగయ్య గౌడ్, దండు నర్సింహా గౌడ్, దూసరి శ్రీనివాస్ గౌడ్, పాశం సురేష్ గౌడ్, దండు రమేష్ గౌడ్, దూసరి శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.

చంద్రయ్య మృతి బాధాకరం

- ఓబీసీ జాతీయ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి





నవతెలంగాణ-తలకొండపల్లి

చంద్రయ్య మృతి బాధాకరమని ఓబీసీ జాతీయ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి అన్నారు. మండలంలోని బీజేపీ జిల్లా నాయకులు శానమో ని పాండు తండ్రి శానముని చంద్రయ్య అనారోగ్య కారణంగా సోమవా రం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఓబీసీ జాతీయ కమిష న్ సభ్యులు ఆచారి, చంద్రయ్య భౌతికకాయానికి పూలమాల వేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలోనీ మాజీ సర్పంచ్లు లలిత జోతయ్య, బక్కి కుమార్, మాజీ ఎంపీటీసీ హేమ రాజు, మాజీ ఉప సర్పం చ్ పద్మ అనిల్, బీజేపీ మండల అధ్యక్షులు రవి గౌడ్, పాండు, గణేష్, మల్లే ష్, నరేష్, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రాఖీ పండుగ వేడుకలు

నవతెలంగాణ-మంచాల

నవతెలంగాణ దిన పత్రిక మంచాల మండల విలేకరి పల్లాటి జగన్ లక్ష్మిలకు, కుమారులైన పల్లాటి హేమ చంద్ర, రాఘవేంద్రలకు సోమ వారం తన చెల్లెలు చింతపట్ల సబితా, కూతుర్లు పల్లాటి వైష్ణవి, హాసిని లు రాఖీ పూర్ణిమ సందర్భంగా రాఖీలు కట్టారు.

అన్నా చెల్లెల అనుబంధమే రాఖీ పండుగ

నవతెలంగాణ-శంకర్‌పల్లి

అన్నా చెల్లెల అనుబంధమే రాఖీ పండుగ. అన్నాచెల్లెళ్ల అనుబంధం ఆప్యాయలకు అనుబంధాలకు ప్రత్యేకత రాఖీ పండుగ జరుపుకోవడం జరుగుతుంది. అన్నదమ్ములకు అక్క చెల్లెలు రాఖీలు కట్టి మాకు రక్షణగా ఉండాలంటూ అ న్నా తమ్ములను అక్కా చెల్లెలు కోరుకోవ డమే ఈ రక్షాబంధన్‌కు ఉద్దేశం. రాఖీ పండుగ సందర్భంగా సోమవారం శంక రపల్లిలో చెల్లెలు అన్నాతమ్ములకు రక్షా బంధన్ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు.





సోదరీమణులను రక్షించండి

- తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో రక్షా బంధన్ సందర్భంగా 'సోదరీమణు లను రక్షించండి' అనే నినాదంతో మహిళలకు సంఘీభావంగా జరిగిన నిరసనా కార్యక్రమంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ప్రెసిడెంట్ బలరాం బాబుబీ జనరల్ సెక్రటరీ రవి బూరబీ జాయింట్ సెక్రటరీ రామ్ ముప్పన, ఈవెంట్ ఫెసిలిటేటర్స్ అసోసియేషన్ (టీఈఎఫ్ఏ) ప్రెసిడెంట్ కుమార్ రాజా, ట్రెజరర్ సూర్యనారాయణ మరియు ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తోటి స్నేహితుని అన్నకు ఆర్థికసాయం

నవతెలంగాణ-తలకొండపల్లి

మండల పరిధిలోని సోమవారం వెల్జాల్ గ్రామానికి చెందిన షకీల్ వారం రోజుల క్రితం నుంచి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నాడు. ముజ్జు వాళ్ళ షకీల్ అన్నకి బ్రెయిన్ స్ట్రోక్ రావడం వలన 2007-2008 బ్యాచ్ ఫ్రెండ్‌కు గ్రూప్‌లో తెలిపారు. తోటి స్నేహితులు ప్రతి ఒకరూ తోచిన విధంగా సహకారమందించారు. దాదాపుగా రూ.19 వేలు షకీల్ అన్నకి ముజీబ్ ఫ్రెండ్స్‌కు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తనకు ఆరోగ్యం పరిస్థితి మెరుగ్గా పడాలని కోరారు. సాయం చేసిన ఫ్రెండ్స్ కు ప్రతి ఒకరికీ ధన్యవాదాలు తెలిపారు.

గాలి కొదిలేసిన నిర్మాణ పనులు

- ప్రభుత్వాలు పాలకులు మారినా ప్రారంభానికి నోచుకోని వైనం
- వెంటనే నిర్మాణం పనులు ప్రారంభించాలి
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శివర్గ సభ్యులు సిలివేరు రాజు
- మురికి నీరు సమస్య పరిష్కారానికి కృషి చేయాలి
- ఎల్లమ్మ తండా మాజీ సర్పంచ్ కాంటేకార్ జగదీష్



నవతెలంగాణ-మంచాల

ఎల్లమ్మ తండా గ్రామగాడి వంపువాగు ప్రాజెక్ట్ నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గసభ్యులు సిలివేరు రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లమ్మ తండా గ్రామంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎల్లమ్మ తండా గ్రామంలో ఉన్న స్థానిక సమస్యల వల్ల ప్రజలు చాల ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ముఖ్యంగా గ్రామంలో చాల చోట్ల అండర్ డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల చాలా చోట్ల మురుగు నీరు నిలిచి దోమలకు నిలయంగా మారాయని, పిచ్చి మొక్కలు కూడా చాలా చోట్ల పెరిగాయన్నారు. ఈ రెండు సమస్యలు ఇండ్ల మధ్యనే ఉండటం వల్ల దోమలు ఇండ్లలోకి వస్తున్నాయని, తండాలో ఉన్న గిరిజనులకు విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. దానికి తోడు చాలా మంది ప్రజలకు భూ సమస్యలు ఉన్నాయని, రేషన్ కార్డు లు లేవని, పెన్షన్‌లు రావడం లేదని, బస్ సమస్య లు ఉన్నాయని తెలిపారు. మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ వేసిన సందర్భంగా సీసీరోడ్లన్నీ పగుల గొట్టారని తెలిపారు. ఆ రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులు చాలా ఇబ్బందిగా మారాయని తెలిపారు. మొదలగు సమస్యలపై అధికారులు స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గాడివంపు వాగు ప్రాజెక్ట్ నిర్మాణం పనులను పట్టించుకునే నాథుడే లేడనీ తెలిపారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా నిర్మాణం పనులు మాత్రం సాగడం లేదన్నారు. ముఖ్యంగా గాడివంపు వాగు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి అయితే గ్రౌండ్ వాటర్ పెరిగి గిరిజన తండాలు మొత్తం అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్లమ్మ తండాలోని గాడివంపు వాగు ప్రాజెక్ట్ నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాంటేకార్ జగదీష్, సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శి జవహర్‌లాల్, మాజీ మండల కమిటీ సభ్యులు సపావట్ వెంకటేష్, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి తదితరులున్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో షాద్‌నగర్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-షాద్‌నగర్

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. సోమవారం మొయినాబాద్ ఫైర్ ఫ్యాక్స్ స్పోర్ట్స్ అండ్ రీసెర్చ్ కాంప్లెక్స్‌లో గ్రాండ్ మాస్టర్ మల్లేష్ యాదవ్ మెమోరియల్ జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు షాద్‌నగర్ యాదవ్ బుడోఖాన్ కరాటే క్లబ్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కటాస్, స్పైరింగ్ టీం కటాస్ విభాగాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ సుధాకర్, సీనియర్ మాస్టర్ సాదిక్ పాషా, నర్సింలు, సాయినాథ్, నరేందర్ నాయక్, ఉత్తేజ్, గోపి నాయక్, పిరు, రాహుల్, శ్రీను, వినయ్ పాల్గొన్నారు.

ట్రైనీ డాక్టర్‌ను హత్యచేసిన వారిని ఉరివేయాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె రామస్వామి



నవతెలంగాణ-చేవెళ్ల

కల్‌కత్తా ట్రైనీ డాక్టర్ లైంగికదాడి చేసిన దుండగులను బహిరంగంగా ఉరివేసి శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె రామస్వామి అన్నారు. సోమవారం సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కలకత్తాలో జూనియర్ డాక్టర్ పై జరిగిన లైంగికదాడి చేసిన ఘటనకు నిరసనగా మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యుడు రామస్వామి మాట్లాడుతూ.. కల్‌కత్తాలో ఆగస్టు 9 రాత్రి జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి సంఘటన హేయమైన చర్య అన్నా రు. స్వాతంత్రం వచ్చి 78 ఏండ్లు అవుతున్న మహిళలకు ఇంకా స్వాతంత్రం రాలేదన్నారు. ఈరోజు నిర్భయ రెండో ఘటన అన్నారు. నిర్భయ ఘటన బస్సులో జరిగితే ప్రభుత్వ ఆస్పత్రిలో జరగడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రబలింగం, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు శివ, గీత కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ గౌడ్, మొయినాబాద్ మండల కార్యదర్శి కే శ్రీనివాస్, జలీల్ వెంకటయ్య సీనియర్ నాయకులు డాక్టర్ శౌరీలు యాదగిరి, మహిళా నాయకురాలు లలితమ్మ వెంకటమ్మ పెంటయ్య శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు





నవతెలంగాణ-తలకొండపల్లి

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఫొటోగ్రఫీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నరసింహ మాట్లాడుతూ..ఒక క్షణాన్ని మధురమైన జ్ఞాపకంగా తీర్చగలిగేది ఫోటోగ్రఫీ అని, ఎన్నో భావాలను ఒక చిత్రంలో తెలిపే గొప్పతనం ఒక ఫోటోగ్రఫీకి మాత్రమే ఉందన్నారు. చిత్ర రూపాన్ని ఫోటోగ్రఫీగా మార్చి ఫొటోగ్రాఫర్లు సమాజంలో చైతన్యం తెస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ మండల అధ్యక్షుడు నరసింహ, ఉపాధ్యక్షులు మధు, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారులు, రమేష్, విజయ్, గౌరవ సభ్యులు కాలే శేఖర్, శీను, రావుఫ్, శ్రీకాంత్, కిరణ్, తరుణ్, వేణు, గిరి, సాయి, మహేష్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

నవతెలంగాణ-తలకొండపల్లి





మండల పరిధిలోని పలు గ్రామాల్లో చౌదర్‌పల్లి, వెల్జాల్, తలకొండపల్లి గట్టుఇప్పలపల్లి, వెంకట్రావుపేట్ గ్రామాలలోనీ సోమవారం రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోదరి రామేశ్వరమ్మ రాఖీ కట్టి, మిఠాయి తినిపించి ఆశీర్వదించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోని ఎమ్మెల్యే సతీమణి మాధవి, కుమారుడు కృష్ణవంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెల్జాల్ గ్రామానికి చెందిన హైదరాబాద్ తమ నివాసంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్‌కు రక్షాబంధన్ సందర్భంగా వారి చెల్లెలు మాధవి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ సోదర సోదరీమణులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం కాలే శేఖర్ నివాసంలో సింధు, శ్రీజ కలిసి కాలే సాయిచరణ్‌కు రాఖీ కట్టి, మిఠాయి తినిపించి ఆశీర్వదించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్న, తమ్ముడు, అక్క చెల్లెల అనుబంధానికి వారధిగా నిలిచే సృష్టిలో ఎన్ని బంధాలు ఉన్నా రక్తం పంచుకోపుట్టిన అన్న చెల్లెల బంధం అపురూపమైన బంధం అనుబంధమైన బంధం రాఖీ పౌర్ణమి దూరంలో ఉన్న దగ్గరయ్యే బంధం ఈ రక్షా బంధం పురానాటి కాలం నుండి ఈ తరం వరకు అనుబంధానికి స్నేహంగానిలిచే ఈ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



శంషాబాద్‌లో రాఖీ సందడి..

- రాఖీల కోసం క్యూ కట్టిన మహిళలు
- రాఖి కట్టించుకున్న ప్రముఖులు





నవతెలంగాణ-శంషాబాద్

శ్రావణమాసంలో ప్రతి ఏటా వచ్చే రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని సోమవారం శంషాబాద్ మండలంలో రాఖీ పండుగ సందడి నెలకొన్నది. శం షాబాద్‌లో నెలకొల్పినల ప్రత్యేక రాఖీ దుఖానలు, మిఠాయి షాపుల వద్ద మహిళలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. రాఖీ పండుగ సందర్భంగా మహిళలు తమ పుట్టింటికి వెళ్లడం కోసం ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. అసలు సమయానికి రాక ఎక్కువ మంది మహిళలు రోడ్ల పై నిలబడి, ఎక్కిన బస్సుల్లో సీట్లు దొరకక నానా ఇబ్బందులు పడ్డారు. శంషాబాద్ మండల కాంగ్రెస్ సీనియర్ నేత కే. చంద్రారెడ్డి చిన్న గొల్లపల్లిలోని తన నివాసంలో తన చెల్లెలుతో రాఖీ కట్టించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పండుగ వల్ల కుటుంబ సంబంధాలు, వారి మధ్య మానవీయ సంబంధాలు బలపడటం కోసం రాఖీ పండుగ దోహదం చేస్తుందని అన్నారు. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మాజీ జడ్పీటీసీ తన్వి రాజు

పండుగ పర్వదినం పురస్కరించుకొని శంషాబాద్ మాజీ జడ్పీటీసీ నీరటి తన్వి రాజు ముదిరాజ్ రాఖీ సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా తెలుసుకున్నారు. రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రతి ఆడబిడ్డా క్షేమంగా ఉండాలి



- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్

నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ స్వగృహంలో సోమవారం తన సోదరీమణులు, మహిళా కౌన్సిలర్లు సంతోష నర్సింలు, రాజ్యలక్ష్మి రమణ, పావని చంద్ర శేఖర్‌లు ఆయనకి రాఖీ కట్టి స్వీట్స్ తినిపించారు. మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కుమార్తె వినూత్న ఆనంద్ ఆయన కుమారుడు వైభవ్ ఆనంద్‌కు రాఖీ కట్టారు. డాక్టర్ సబితా ఆనంద్ పట్టణ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డికి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్లు అందరూ ప్రేమ, అభిమానాలతో రాఖీ పండగ జరుపుకోవాలని అలాగే ప్రతీ ఆడబిడ్డ క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు



ఘనంగా ఫలహారం బండ్ల ఊరేగింపు



- పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి డివిజన్‌లోని ఓల్డ్ లింగంపల్లి విలేజ్ లోని హనుమాన్ టెంపుల్, గాంధీ బొమ్మ, పలు బస్తీలలో బోనాల పండుగ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, ఎంబీసీ చైర్మెన్ జెరిపేటి జైపాల్, రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తుల మధ్య కొనసాగిన ఈ ఊరేగింపులు కనుల పండువగా కొనసాగింది. కార్పొరేటర్ మాట్లాడుతూ..బోనాల పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు చిహ్నమని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో గడ్డం రవియాదవ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్, కొయ్యడ లక్ష్మణ్ యాదవ్, పాండు ముదిరాజ్, సురేష్, రేవంత్, హరీష్, ప్రణయ్, వెంకటేష్, రాకేష్, నవీన్, భరత్, సుశాంత్, మల్లేష్ నిర్వాహకులు, లింగంపల్లి విలేజ్ యూత్ సభ్యులు తదితరులున్నారు.

పూడూర్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ-పూడూర్

రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం గ్రామాల్లో ఆడపడు చులందరూ తమ పుట్టింటికి చేరుకొని అన్న తమ్ముళ్లకు ఆత్మీయ బంధంతో రాఖీలు కట్టి రక్షా బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఎన్నో పండగలు వస్తున్న రాఖీ పౌర్ణమితో ఎంతో సంతోషంగా ఉందని తమ పుట్టింటికి వచ్చి అన్నదమ్ములను అందర్నీ కలుసుకొని రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నామని పలువురు ఆడపడుచులు పేర్కొంటున్నారు



సాయిబాబాకు రాఖీ కట్టిన మహిళలు

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

రాఖీ పండుగ సందర్భంగా మహిళా సోదరీమణులు గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయంలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాకు మర్యాద పూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సాయిబాబా నియోజకవర్గ ఆడపడుచులందరికి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అంజమ్మ బాలమణి, మాధవి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

